క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

దుబ్బాకటౌన్/సిద్దిపేటకమాన్: దుబ్బాక పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం నిర్వహించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దుబ్బాక డిపో ఇంచార్జి మేనేజర్ సుఖేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు, సలహాలు, సందేహాల కోసం 99592 26271 కాల్ చేయాలని సూచించారు.

సర్వేయర్‌పై ఫిర్యాదు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల సర్వేయర్ అక్రమాలపై సోమవారం రాష్ట్ర డైరెక్టర్ సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డు కమిషనర్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు సూరగోని శేఖర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేళ్ల గడుస్తున్నా భూమి కొలతలు చేపట్టడం లేదన్నారు. ఈ విషయమై తహసీల్దార్, ఆర్డీఓకు ఫిర్యాదు చేసినా బాధితులకు న్యాయం జరగడం లేదని వాపోయారు. వందల దరఖాస్తులు వచ్చినా సర్వేయర్ పరిష్కారం చూపడం లేదని ఆరోపించారు. కమిషనర్ స్పందించి సర్వేయర్, తహశీల్దార్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుబ్బాకలో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

దుబ్బాక: పట్టణంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణతో పాటు జిల్లా భౌగోళిక పరిస్థితులు ఆకళింపు చేసుకునేందుకు ఈ మార్చ్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు పరశురామ్, హరీశ్, ప్రొహిబిషనరీ ఎస్ఐ మానస, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ బగేల్, ఇన్‌స్పెక్టర్లు హరి బాబు, మల్లేశ్వరరావు సిబ్బంది ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తొగుట(దుబ్బాక): స్థానిక మండల వనరుల కేంద్రంలో పీఆర్టీయూ 2025 క్యాలెండర్‌ను ఎంఈఓ నర్సయ్య సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి, హనుమారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పరమేశ్వర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రాంచంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, ఉపాధ్యాయులు వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య, శంభురెడ్డి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ప్రతినిధులు సూచించారు. మండల పరిధిలోని బూర్గుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం టై, బెల్టులు, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కిష్టారెడ్డి, ఉపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ దాతలు అందించే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గోలి సంతోష్, సభ్యులు సంజయ్‌గుప్తా, నేతి శ్రీనివాస్, పరమేశ్వచారి, మల్లేశంగౌడ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అర్జున్, శ్రీనివాస్‌రెడ్డి, రఫీక్, కవిత, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

భాగస్వాములుకండి: ఎస్ఐ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ నీరేశ్

చేర్యాల(సిద్దిపేట): సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలని ఎస్ఐ నీరేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఇండియా మిషన్ కాంపౌండ్ ఆవరణలో సంఘ సేవకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు అందె విజయ్‌కుమార్ సోమవారం నిర్వహించిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అక్కడ ఉపయోగంలో ఉన్న పలు వస్తువులు, దుస్తులు వంటివి ఉంచారు. పట్టణ ప్రజలుకూడా తమకు అవసరంలేని ఇతరులకు ఉపయోగపడే వస్తువులు అక్కడ ఉంచాలని సూచించారు. అవసరమున్న వారు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుదాస్, పీటర్, యాకూబ్, అమల, క్రిస్టో లైట్, ఒనేసిమ్, జెస్సి రాజ్, జోయెల్ రాజ్ పాల్గొన్నారు.

ఈ-సేవలు.. ఇంకెప్పుడు

- పంచాయతీలలో నిరుపయోగంగా కంప్యూటర్లు
- అలంకారప్రాయంగా సర్వర్ బాక్స్‌లు
- ఏళ్లు గడిచినా ప్రజలకు తప్పని తిప్పలు

ఇప్పుడు ఏ పనికావాలన్నా ఆన్‌లైనే ఆధారం. బ్యాంకు లావాదేవీలు, ఆధార్, రైతులు ఏ సబ్సిడీ పొందాలన్నా, లోన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా.. దేనికైనా ఆన్‌లైన్‌లోనే చేయాల్సిన పరిస్థితి. అందుకోసం గ్రామాల్లో ఈ సేవలు పేరుతో ప్రజలకు అందుబాటులో తేవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాట్లు చేసినా కొన్ని చోట్ల అవి నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజలు ఈ-సేవలకు దూరంగా ఉండాల్సి వస్తోంది.



పంచాయతీ భవనంలో ఉన్న సర్వర్ బాక్సు

మద్దూరు(హుస్నాబాద్): పాలనలో పారదర్శకం, జవాబుదారీనంతోపాటు సేవల్లో వేగాన్ని పెంచేందుకు 2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఈ పంచాయతీలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా నాలుగేళ్ల క్రితం కొన్ని పంచాయతీలకు కంప్యూటర్, ప్రింటర్లను పంపిణీ చేసింది. ప్రతి కార్యాలయంలోను ఆన్‌లైన్ సౌకర్యం కల్పించడం కోసం వాటిని ఏర్పాటు చేశారు. కానీ పూర్తిస్థాయిలో ప్రజలకు ఈ-సేవ అందుబాటులోకి రావడంలేదు.

అందని సేవలు

పంచాయతీలో ఏర్పాటు చేసిన సర్వర్ బాక్సులు పని చేయకపోవడంతో పంచాయతీలలోని కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. ఆ బాక్సులు పంచాయతీలకు చేరుకొని సంవత్సరాలు గడుస్తున్నా ఉత్సవ విగ్రహాల్లాగా మారి లబ్ధిదారులకు మాత్రం సేవలు అందడం లేదు.

పర్యవేక్షణ కరువు

మండలంలోని కొన్ని గ్రామాల్లో తప్ప చాలా గ్రామాల్లో ఈ-సేవలు అందుబాటులోకి వచ్చినా నిర్వహణ మాత్రం కరువైంది. చాలా చోట్ల అధికారులు, సిబ్బంది తమ సెల్ ఫోన్లతోనే పనులు పూర్తిచేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కంప్యూటర్ల మినహా అనుబంధ పరికరాలు పంపిణీ కాలేదు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న పనికైనా మండల కార్యాలయానికి పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది.

అందుబాటులోకి రాలేదు..

కొన్ని పంచాయతీల్లో ప్రభుత్వం సరఫరా చేసిన కంప్యూటర్లు అందుబాటులోకి రాలేదు. పంచాయతీకి ఒక కంప్యూటర్ చొప్పున గతంలోనే సరఫరా చేయగా దశలవారీగా స్కానర్, ప్రింటర్ తదితర సామగ్రి అందించారు. కొన్ని గ్రామ పంచాయతీలకు దాతలు సహకరించగా మరి కొన్ని గ్రామ పంచాయతీలకు పంచాయతీ నిధులతోనే అప్పటి సర్పంచ్‌లు, కార్యదర్శులు కొనుగోలు చేశారు. మరికొన్ని చోట్ల భవనాల్లో ఉన్నా అలంకారప్రాయంగా మారాయి. ప్రతి గ్రామంలో ఈ-సేవ అందుబాటులోకి వచ్చే విధంగా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తాం



గ్రామ పంచాయతీ ఈ-సేవలకు త్వరలోనే కనెక్షన్‌లు అందజేస్తాం. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం. సమస్యలను పరిష్కరిస్తాం.

– రామ్మోహన్, ఎంపీడీఓ, మద్దూరు

చిన్నారుల్లో అవగాహన శక్తి పెంచాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక



మాట్లాడుతున్న సీఆర్‌పీ ఉమాదేవి

మద్దూరు(హుస్నాబాద్): చిన్నారుల్లో మంచి పరివర్తన, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెరిగేలా కృషిచేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక పిలుపునిచ్చారు. దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో రిలయన్స్ ఫౌండేషన్, క్రై ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈసీసీ ప్రాజెక్టులో భాగంగా సిబ్బందికి సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు తమ పనులను తాము నిర్వహించుకునేలా అంగన్వాడీ సిబ్బంది కృషి చేయాలన్నారు. అంగన్వాడీలో ఉపాధ్యాయులు లేని సమయంలో ఎలా బోధించాలనే అంశాలను సీఆర్‌పీలు నారదాసు ఉమాదేవి, మంద భార్గవి సహాయకులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ చైర్ల అందజేత



చైర్స్ అందజేస్తున్న జానకీమాధవరెడ్డి దంపతులు

సిద్దిపేటరూరల్: విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని జక్కాపూర్ ఎన్నారై మొసర్ల జానకీమాధవరెడ్డి సూచించారు. నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం రూ.40వేల విలువచేసే 50స్టడీ చైర్లతోపాటు ప్లాంక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఇటీవల గణిత టాలెంట్ టెస్టులో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన సౌమ్యకు రూ.10వేలు అందించారు. జానకీమాధవరెడ్డి దంపతులకు హెచ్‌ఎం షౌకత్ అలీ అభినందనలు తెలిపారు. మాజీ సర్పంచ్ పరశురాములు, మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన వెంకటయ్య



విద్యార్థులో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రుచికరమైన భోజనం పెడుతున్నారా లేదా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట టీపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ వడ్ల ప్రభాకర్, నాయకుడు ఐతం శ్రీనివాస్, నరేశ్, నవీన్, సన్నిత్ తదితరులు ఉన్నారు. అనంతరం భూంపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉషికె నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.

క్రికెట్ క్రీడాకారులకు శిక్షణ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో నూతనంగా ఏర్పాటు చేసిన మైదానంలో ఆర్‌వీఎంబీపీ అకాడమీ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీ నుంచి ఓపెన్ టూ ఆల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని అకాడమీ సభ్యులు మానాల రవి, డీవీ రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల జట్లు ఎంట్రీ ఫీజ్ రూ.5వేలు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విన్నర్ జట్టుకు టోర్నీతోపాటు రూ.50వేలు, రన్నర్ జట్టుకు ట్రోఫీ, ప్రైజ్ మనీ రూ.25వేలు అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90101 97977, 96185 64647, 90108 38880లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

దుబ్బాక: ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి పాడిఆవు మృతి చెందిన ఘటన దుబ్బాక ఏదుల్లచెరువు సమీపంలో సోమవారం జరిగింది. స్థానిక రైతు మల్లుగారి దినేశ్ రెడ్డికి చెందిన ఆవు ఏదుల్లచెరువు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.70వేలకు పైగా ఉంటుందని, బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు కోరారు.

పంచాయతీ ఏర్పాటుకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మర్మాముల గ్రామ పరిధిలోని బంజరను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుంచి బంజరను గ్రామ పంచాయతీగా చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండీ జిలాని, మాజీ ఉపసర్పంచ్ కర్ణాకర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలతో ఎంతో మేలు



దుబ్బాకటౌన్: జాతీయ రైతు దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

రైతులే దేశానికి వెన్నుముక

తొగుట(దుబ్బాక): సేంద్రియ పంటలే ఎంతో మేలని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని పెద్దమాసాన్‌పల్లిలో జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి పెరుగుతుందన్నారు. నేల, వాయు కాలుష్యం అవుతుందని, ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వరి కొయ్యలను కాల్చకుండా డీ కంపోజర్ వినియోగించాలని, క్రిమి కీటకాలను నియంత్రించేందుకు జిగురు అట్టలు వినియోగించాలని సూచించారు. రైతులకు డీ కంపోజర్, జిగురు అట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ నాగార్జున, మాజీ ఉప సర్పంచ్ రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలతో ఎంతోమేలు...

దుబ్బాకటౌన్: రైతులు పండిస్తేనే అందరికీ ఆహారం అందుతుందని, దేశానికి వెన్నెముక రైతు లేనని రాయపోల్ మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. రాయపోల్ మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా కిసాన్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు రైతుల శ్రమ, వ్యవసాయం వివరించామన్నారు. విద్యార్థులు రైతుల వేషధారణలో అలరించారు. అలాగే దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోను రైతు దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు వంశీకృష్ణ, మల్లికార్జున్, స్రవంతి, మంజుల, శృతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దుబ్బాకటౌన్: వేడుకల్లో పాల్గొన్న అన్నదాతలు

రైతులకు సన్మానం..

గజ్వేల్: రైతు దినోత్సవం సందర్భంగా గజ్వేల్ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి సోమవారం రైతులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పంచతంత్ర పాఠశాలలో ..

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని పంచతంత్ర పాఠశాలలో రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు రెతు వేషధారణలో హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. రైతుల దగ్గరకు వెళ్లి వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులను సన్మానించారు. ప్రిన్సిపాల్ శ్యామల మాట్లాడుతూ రైతు లేనిదే దేశం లేదని, రైతే రాజు అని విద్యార్థులకు వివరించారు.

కాంగ్రెస్ పార్టీతోనే క్రైస్తవుల సంక్షేమం

సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు ఇమామ్



కేక్ కట్‌చేస్తున్న అత్తు ఇమామ్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ హయాంలోనే క్రైస్తవుల అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. మరో పదేళ్ల పాటు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభువు దీవెనలు అందించాలని ఆయనతోపాటు జిల్లా ఉపాధ్యక్షుడు మంద పాండు ఏసు ప్రభువును కోరారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొని కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో క్రైస్తవుల పాత్ర ఎంతో ఉందన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి, హరికృష్ణల సూచన మేరకు ముందస్తు క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యామన్నారు. చర్చ్ ఫాదర్ ఆంటోనీతోపాటు పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో తప్పెట శంకర్, కలీమొద్దీన్, వాహెబ్, సదాశివారెడ్డి, అజ్మత్, రాజిరెడ్డి, మధు, గయాజొద్దీన్, సలీం ఫయాజ్, నజ్జు, వనజ, సంతోషి, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు రాయితీలు

ఏడీఏ అనిల్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న అనిల్‌కుమార్

వర్గల్(గజ్వేల్): ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం రాయితీలతో ప్రోత్సాహం అందిస్తోందని ములుగు డివిజన్ ఏడీఏ అనిల్‌కుమార్ అన్నారు. వర్గల్ మండలం తున్కిఖాల్సా రైతువేదికలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు మొక్కలు, డ్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వం 90శాతం రాయితీ ఇస్తుందన్నారు. తోటల పెంపకానికి సంవత్సరానికి రూ.4,200 అందజేస్తూ ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెల టన్ను రూ.20వేల ధర పలుకుతుందని, భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ సాగువైపు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శేషశయన తదితరులు పాల్గొన్నారు.

భూ సారాన్ని పెంచడం తప్పనిసరి

మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ



మాట్లాడుతున్న వెంకట్రావమ్మ

కొమురవెల్లి(సిద్దిపేట): నత్రజని వాడకాన్ని తగ్గించి, భూ సారాన్ని పెంచడం అందరి బాధ్యత అని మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించడం మన బాధ్యత అన్నారు. సేంద్రియ కర్బనం తక్కువగా ఉన్న నేలల్లో జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పంటలను వేసి పొలంలో కలియదున్నాలని సూచించారు. వర్షకాలంలో నేల పైపొర కొట్టుకుపోకుండా వాలు అడ్డంగా దున్నుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ మోకు దెబ్బ మండల అధ్యక్షుడిగా భూపతి

మిరుదొడ్డి(దుబ్బాక): గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ మండల అధ్యకుడిగా మల్లుపల్లికి చెందిన సిద్ధి భూపతి గౌడ్ నియామకమయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం నర్సింహులు గౌడ్ సోమవారం భూపతి గౌడ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

◆ ఐకమత్యంతో ముందుకు..

సిద్దిపేటరూరల్: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మాదిగలు ఐకమత్యంతో ముందుకు సాగాలని ఎస్సీ మాదిగల సమన్వయ కమిటీ వ్యవస్థాపక నాయకులు పిలుపునిచ్చారు. నారాయణరావుపేటలో సోమవారం మాదిగల సమన్వయ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా దండుశంకర్, రోమాల శంకర్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ముందుకు సాగాలన్నారు. బింగి పవన్, బాబు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ టీడీపీ హయాంలోనే దుబ్బాక అభివృద్ధి

దుబ్బాకటౌన్: తెలుగుదేశం పార్టీ హయాంలోనే దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు జయరామ్ చందర్ అన్నారు. సోమవారం ఆర్యవైశ్య భవనంలో తెలుగు యువత ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రూపేశ్ రెడ్డి, రమేశ్, అశోక్ గుప్తా, జనార్దన్, వెంకట్ రెడ్డి, రాములు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు 'డివిజన్' కోసం బైక్ ర్యాలీ

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం వరకు తలపెట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం స్థానిక సుభాష్ చంద్రబోస్ విగ్రహం హనుమాన్ టెంపుల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

◆ కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్, రామంచ, అల్లీపూర్, గోనెపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బత్తుల మల్లేశం మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు.

◆ దుబ్బాకలో బీజేపీ బలోపేతం

దుబ్బాక: దుబ్బాక మున్సిపాల్టిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ఎంపీ రఘునందన్‌రావు నాయకత్వంలో కృషి చేస్తామని బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి రమేశ్‌రెడ్డి, ఎన్నికల నిర్వహణ అధికారి శ్రీకాంత్ యాదవ్ అన్నారు. 42వ బూత్ కమిటీ బీజేపీ అధ్యక్షుడుగా బెల్లె సంజీవులును సోమవారం ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, బాబు, బ్రహ్మస్వామి, రమేశ్, స్వామి తదితరులు ఉన్నారు.

◆ బాధిత కుటుంబానికి బియ్యం అందజేత




మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన పేద యువకుడు గొల్లస్వామి కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి సోమవారం పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో గొల్ల మల్లేశం, సుధాకర్, కృష్ణ ఉన్నారు.

◆ ఘనంగా రామానుజన్ జయంతి వేడుకలు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట ఉన్నత పాఠశాలల్లో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో గణితానికి సంబంధించిన వివిధ నమూనాలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మద్దూరు, చేర్యాల ఎంఈఓలు వరదరాజు, కిష్టయ్య ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణితానికి చేసిన సేవలను కొనియాడారు. హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధ్యానంతో పరీక్షల భయం దూరం



హుస్నాబాద్: ఇంటర్మీడియెట్ కమిషనర్ ఆదేశానుసారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం హార్ట్‌ఫుల్‌నెస్ ప్రోగామ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ గంగాధర్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ప్రోగ్రామ్ ఇన్‌చార్జి నగేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, పరీక్షల భయం పోగొట్టటానికి ధ్యానం ఉత్తమం అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.